

# త్వమేవ శరణం

# త్వమేవ శరణం

- మమ

డా॥ కె. రామారావు

Sponsored by :

**SRIDEVI**

Hyderabad

# 1

సమతను మమతను పంచి
జనతను జాగృతి చేసి
జ్ఞాన జ్యోతినే వెలిగించి
జగతికి గమ్యం చూపిన
- గురుదేవా!

ఏమివ్వనూ - నీ కేమివ్వనూ?
నా తనుమన ప్రాణాలే నీవైతే
నా జపతప ధ్యానాలే నీవైతే
నీకేమివ్వనూ - ఇంకేమివ్వనూ?

నీ కృపకు - కృతజ్ఞతతో నేచేయు
కన్నీ......టి పాదాభిషేకమును
గైకొనుమా నా గురుదక్షిణగా
నీకిదే..... నా అభివందనం
- పాదాభివందనం!

# 2

చిరునవ్వులతోనే శాంతినిపంచే ఓ తండ్రీ!
తనివితీర తాకాలనివుందీ నీ పాదాలు
- కాని

దేహబుద్ధితో కలుషితమైన ఈ చేతులతో
నేతాకితే - మలినపడతాయేమో నీ పాదాలు
- అందుకే తాకలేకున్నానూ!

కనుచూపులతోనే చింతలుబాపే ఓ తండ్రీ!
కన్నీళ్ళతో కడగాలనివుందీ నీ కాళ్ళు
- కాని

రాగద్వేషాలతో రగిలిపోతూ కాలిపోతున్న
నా కన్నీటివేడికి - కందిపోతాయేమో నీ కాళ్ళు
- అందుకే కడుగలేకున్నానూ!

పునీతులెందరో నీకోసం పరితపిస్తున్నారులే
కారే వారి కన్నీటిధారలో నా కన్నీరు కలిసిపోనీ
తాకే వారి చేతులే నా చేతులుగా మిగిలిపోనీ
చాలులే ఆ సంతృప్తి - కోరనులే అంతకుమించి
- అదైనా మిగిలిపోనీ కడవరకూ!

శోకనిలయమైన పుడమిపైన మరి పుట్టకూడదనీ
దారికోరి నాడు చేరాను నీ పాదాలచెంత
- కాని

నీవు పంచే ప్రేమామృతం త్రాగిత్రాగి తనివితీరక
ఎన్నిమార్లైన మరి పుట్టాలని వుంది - ఈ పుడమిపైన
- కోరుతున్నానని కోపగించుకోకు!

మోక్ష సింహాసనాన్ని అధిరోహించాలని గానీ
ఆత్మ సామ్రాజ్యానికి అధిపతినవ్వాలని గానీ
- కోరనులే

నీవుండగానే - నీబిడ్డగా నేను మిగిలుండగానే
నీ పాదాలచెంత నే రాలిపోతే చాలులే
- కోరనులే అంతకుమించీ!

## 3

ఎంత దయలేనివారీ మనుజులూ!
స్వార్థమే వారికీ పరమార్థమా?

హృదయమున్న అమ్మలారా - అయ్యలారా!
అలకచెందక ఆలకించరా నా మనవీ! ॥ఎంత॥

ఆ దేవదేవుడే దేహాన్ని ధరియించి
ఈ భువిపైన మనుజుడై అవతరిస్తే
ఆ పరమపావనుని పాదాలచెంత చేరి
సేవించి తరియించు విధమిదియేనా? ॥ఎంత॥

కోమల కుసుమాల తాకిడికే
కందిపోయే పాదారవిందాలను
గడపగడపకూ తిప్పుతున్నారే
ముక్తికోరేవారి మార్గమిదియేనా? ॥ఎంత॥

## 4

అడుగడుగో మన ఆచార్యదేవుడూ - ఆరాధ్య దైవమూ!
అవనిపైన అజ్ఞానతిమిరాన్ని హరియింప
గోదావరితీరాన సాగరసంగమ చేరువలో
జిన్నూరుక్షేత్రాన ఉదయించిన జ్ఞాన సూర్యుడూ!
॥అడుగడుగో॥

ఉన్నానూ మీఅండగ నేనున్నానంటూ
చిరునవ్వులతోనే శాంతిని పంచుతూ
కనుచూపులతోనే చింతలు బాపుతూ
వస్తున్నాడూ మీముందుకు తానేవస్తున్నాడూ!
॥ అడుగడుగో ॥

మీ దండలుగాని దండాలనుగాని తానాశించుటలేదు
మీ ఆస్తులతోటి అంతస్తులతోటి అతనికి పనిలేదు
మీ యదలో కొంచము చోటిచ్చి లోదృష్టితో చూడండీ
ఉన్నాడూ! మీయదలోనే - మీ అండగతానే ఉన్నాడూ!
॥ అడుగడుగో ॥

సంసారసాగరంలో దరిచేరు దారితెలియక
కష్టాలతో నష్టాలతో తల్లడిల్లు దీనులారా!
వెళ్ళకండి వెళ్ళకండి ఇల్లువీడి కారడవులకు
వీడకండి వీడకండి చేయుచున్న వృత్తులేవీ!
॥ అడుగడుగో ॥

జరుగరానిదేదీ జరుగుటలేదూ - బాధెందుకు మీకు?
జరుగవలసినదేదో జరుగుతువుందీ
- బరువెందుకు మీకు?

బరువులు మీరు మోయకండీ
- బంధాలను పెంచుకోకండీ!
భారము నాపైమోపండి
- మీ అండగ నేనున్నానంటున్నాడూ!
॥ అడుగడుగో ॥

మట్టిలో కలిసే ఈ మనుష్యులు కారండీ మీకు బంధాలు
మరువకండి మరువకండి మీ మనస్సే మీకు బంధమనీ
మనస్సు మూలమేదో చూడండీ - మనస్సంటూ లేదండీ!
ఈ సృష్టికి కర్తలు మీరండీ
- నమ్మండీ నామాటంటున్నాడూ!
॥ అడుగడుగో ॥

**5**

ఏనాటి బంధమో మన అనుబంధమూ
పెనవేసి ముడివేసిన ఈ సంబంధమూ
విడతీయరాని మధురానుబంధమూ
చేర్చిందినన్నూ నీశరణాల నీడలోన!

కొలబద్దలకందని నీ ప్రేమను
కురిపించుచున్నావు ఈ దీనుడిపైన
ఏమి చేశాననీ నీకింతకరుణ నాపైన
ఏమిచ్చి నీ ఋణము నే తీర్చుకోనూ?

మోక్షసింహాసనమో - ఆత్మసామ్రాజ్యమో నాకొద్దులే
నీఅండలేక - నిను చూడకుండ - నేనుండలేనూ
నీవుండగానే - నీబిడ్డగా నేను మిగిలుండగానే
నీవు చూపిన నీ నీడలోనే రాలిపోనీయినన్నూ!

**6**

ఉన్నానూ నీకంటే భిన్నంగా
నేనింకా మిగిలేవున్నానూ!

॥ ఉన్నానూ ॥

ఉన్నది నీ ఒక్కడివేనని నా ఊహకందినా
అది నిలకడగా నామదిలో నిలబడకుందీ
జన్మలతరబడి భోగాలను నే మరిగిమరిగి
నిండుమనస్సుతో నీకర్పణ కాలేకున్నానూ!

॥ ఉన్నాను ॥

కవ్వించే మనస్సుతో కలిసి మనలేక
మలిన తలపులతో నామోము నీకు చూపలేక
నినువీడి దూరంగ నే పారిపోదామంటే
తెలియని పాశమేదో పెనవేసి ఆపుతుందీ!

॥ఉన్నానూ॥

రూపాలరొంపినీ దాటలేని నేనూ
మమకారాల మాయజాలంలో చిక్కుకొని
మరణకాలమందు మరుతునేమొ నిన్నూ
నీవైనా మరువకు విడువకు నాచేయి!

॥ఉన్నానూ॥

**7**

చూస్తున్నా నీ మోమునే - చేస్తున్నా నీ చింతనే
ఎంతచేసినా నామనస్సేమో మారకున్నదీ!

॥చూస్తున్నా॥

నీ సంకల్పమే ఈసృష్టిలో జరుగుతుందనీ
మేమెన్ననుకున్నా ఫలితమేమొ శూన్యమనీ

మా సంకల్పాలకు శక్తిలేదని తెలిసికూడ
నా మనస్సు కడుతుందీ గాలిమేడలెన్నెన్నో!
॥ చూస్తున్నా ॥

ఫలితాన్ని ఆశించి పని చేసినంతకాలం
ఆ పని ప్రారబ్ధరూపాన ప్రతిజన్మలోనూ
బదులు చెప్పేవరకు తరుముకొస్తుందనీ
తెలిసికూడ ఫలితాన్ని నే కోరుతున్నానూ!
॥ చూస్తున్నా ॥

నేనంటే నాకింకా అభిమానమింక చావలేదూ
నాదంటే నాకింకా మమకారమింక వీడలేదూ
సమతా మమతా కరుణా నాలో లేనేలేవూ
రాగద్వేషాలతో నిరతము నే కాలిపోతున్నా!
॥ చూస్తున్నా ॥

నేనూ నేనని అంటున్న నేను లేనేలేననీ
నీకూ నాకూ అడ్డుగవున్న ఈ నేను దాటితే
ఉన్నది నీ ఒక్కడివేనని నాకూ తెలుసు
తెలిసికూడా నేనంటేనే నా కెందుకీమోహము?
॥ చూస్తున్నా ॥

దరిచేరు దారి తెలిసినా గమ్యం చేరలేక
ద్వంద్వాలు దాటి బంధాలు తెంచుకోలేక
మృత్యువు తరుముకు వస్తుంటే దిక్కుతోచక
శరణుకోరి నీ ముంగిట నే నిలుచున్నానూ!
॥ చూస్తున్నా ॥

**8**

నాయదలోన కొలువున్న నా తండ్రీ
కంటున్నావా నాయదలోని వ్యధలన్నీ!
నా మదిలోన నెలవున్న నా తండ్రీ
వింటున్నావా నా మదిలోని సొదలన్నీ!
॥ నాయదలోనా ॥

బండలాంటి కండలేమో కరిగిపోతున్నా
దేహబుద్ధి నన్నింకా వీడకున్నదీ
మానసమింకా నాలో చావకున్నదీ
మంచీచెడు ఎంచుట మానకున్నదీ!
॥ నాయదలోనా ॥

అవమానాలు నన్నింకా వేధిస్తున్నాయి
మమకారాలు నన్నింకా బంధిస్తున్నాయి
రాగద్వేషాలింకా నాలో రగులుతున్నాయి
నిశ్చలస్థితిలో నేను నిలబడలేకున్నానూ!
॥నాయదలోనా॥

నా గుండెలో నిండుగ నీవు నెలవున్నా
నీ జాడ తెలియక కుమిలిపోతున్నా
జాలిచూపి దారిచూపి దరిచేరుస్తావో
మరికాదని పొమ్మంటావో అది నీ యిష్టం!
॥నాయదలోనా॥

## 9

ఎంత పిలిచినా పలుకకున్నావూ
వినిపించుటలేదా తండ్రీ నా పిలుపూ?
గుండె పిలుపూ తెలియని నేనూ
గొంతుతో పిలిచాననీ కినుకా నీకూ?

గుండెనిండుగా నే పిలవాలనుకున్నా
తలుపు తెరచుట నీవు మరచావేమో

అది మారుపలుకకా మౌనంగావుందీ
అందుకే ఈ వేదనా - నా నివేదనా!

కురిపించవా నాపైన నీ కరుణామృతం
వెలిగించవా నాలోన నీ జ్ఞానజ్యోతినీ
దాటించవా నను ఈ అజ్ఞానతిమిరాన్నీ
నడిపించవా నను నీ శాంతిశిఖరాలకూ!

## 10

మంచిని చేయుటే నేచేసిన నేరమా?
నే చేసిన మంచే నా పాలిట శాపమా? ॥మంచిని॥

నా కనులముందే నీవు నిలుచున్నా
కనులుండికూడ నే చూడలేకున్నానూ
అడ్డుతెరలెన్నో ఉన్నాయి మన మధ్యనా
హతవిధీ! విధి ఎంత దయలేనిదీ! ॥మంచిని॥

కనులార నిన్నూ నే కనలేనినాడూ
నాకు కనులుండిమాత్రం లాభమేముందీ?
బ్రతికుండిమాత్రం నే చేసేది ఏముందీ?
ఇది శాపమా - నే చేసిన పాపమా? ॥మంచిని॥

చెంతకు పిలిచి మనిషిగ చేశావే
నీ ప్రేమతో నన్ను మైమరపించావే
ఎందుకు పిలిచావో - ఎందుకు మరచావో
నాకేమో తెలియదు - నీకైనా తెలుసునా?
॥మంచిని॥

నీ మానసపుత్రుడ నేనేనన్నావే
నిన్నేనమ్మి నీ చెంతకు చేరిన నన్నూ
మరచుట నీకిది తగునా తండ్రీ?
నీవే కాదని అంటే దిక్కెవ్వరు ఇక నాకూ?
॥మంచిని॥

## 11

అంతా భ్రాంతియేనని తెలిసికూడ
మాయపొరలింకా వీడకున్నవీ
మానసమింకా నాలో చావకున్నదీ
నిజమేమో మరి తెలియకున్నాదీ!
నిజము తెలియక నూరేళ్ళు బ్రతికినా
జ్ఞానములేని జన్మ అది వ్యర్థమనీ

మరణమెమో తథ్యమనీ తెలిసికూడ
నేనింకా మరి మిగిలేవున్నానూ!

పొందినదేమిటో తెలియకున్నదీ
పొందినదేదైనా ఉందని అనుకున్నా
అది నిలకడగా నాలో నిలబడకుందీ
నిలకడలేనిది నిజమెట్లౌతుందీ?

మనస్సుమూలమింకా తెలియకున్నదీ
తెలియని వెలితేమో అది వేధిస్తుందీ
మిగిలిన శేషప్రశ్న నిలదీస్తుందీ
బదులు తెలియక బాధతీరకున్నదీ!

లోలోన జ్వాలలేవో రాజుకుంటున్నాయీ
అవి చితిమంటలకే చేరుస్తాయో
జ్ఞానజ్వాలలకే ఆహుతిచేస్తాయో
వైనంలేని ఈపయనం ముగిసేరోజెపుడో?

కాలమేమో మరి కరిగిపోతుందీ
తానెవరికోసమూ అది ఆగనంటుంది
ఆయువేమో మరి తరిగిపోతుందీ
తప్పదాతండ్రీ! నాకింకా ఈ తనువులమోత?

## 12

ఎన్నాళ్ళుపాడినా ప్రతిరోజుపాడేది ఈ పల్లవేగా
ఎన్నాళ్ళు ఆడినా ఆదీ అంతములేని ఈ ఆటయేగా
॥ ఎన్నాళ్ళు॥

వింటున్నామే మకరందమొలికేటి నీమాటలెన్నెన్నో
కనులారకంటున్నామే కన్నీరు తుడిచేటి నీ లీలలెన్నో
తనివితీరా త్రాగుతున్నామే నీవు కురిపించు జ్ఞానగంగా
కుక్కకుండే కృతజ్ఞతైనాలేకుండా ఇంకెన్నాళ్ళు బ్రతకాలీ?
॥ ఎన్నాళ్ళు॥

ఆ దేవుడివే నీవని నోటితో అందరూ అంటున్నారే
అంటున్నదే నిజమైతే మరి అన్యుల తలపెందులకో?
జన్మలతరబడి పతితులుగానే బ్రతికామె
వెలయాలిలా నటియించు ఈ బ్రతుకులింకెన్నాళ్ళు?
॥ ఎన్నాళ్ళు॥

రోగాలతొరోష్టులతో తను వడిలిపోతుందీ
కాలసర్పం కాటువేయ అది మాటు వేసుందీ

తంటాలమారి ఈ మనస్సేమో మరి మారకున్నదీ
దిక్కుతోచక శరణుకోరి నీ ముంగిట నిలుచున్నా!
॥ఎన్నాళ్ళు॥

వంచన చేసుకుంటు నేనింక బ్రతకలేను తండ్రీ
మాయలాడి నా మనస్సుచేసే మోసమింకా సాగనీకు
వచ్చిపోయే సత్తరువుగ చేయకు నా బ్రతుకింకా
నా గుండె గూటిలోన నిండుగ నీఒక్కడివే ఉండిపో!

పాడలేను నేనింకా ఆ పాత పల్లవీ!
ఆడలేను నేనింకా తుదిలేని ఆ ఆటనూ
ఆడలేనూ!
నే పాడలేనూ!

**13**

ఏదీ ఏదీ ఆనాటి వేదనయేదీ?
ఏదీ ఏదీ అలనాటి తపనయేదీ? ॥ఏదీ॥

నీ పొందుకోరి పరితపించి రోదనతో
కంటికికడివెడు కన్నీరొలికిందీకనులేనా?

నీ పాదసేవకై పరితపించి వేదనతో
గుండెలుపగిలేలా కుమిలిందీయదయేనా? ॥ఏదీ॥

క్షణమే ఒక యుగమై విలపించిన
ఆనాటి తపన నేడేది నాయదలో?
యుగమే ఒక క్షణమై గడిపిన
అలనాటి ప్రేమ నేడేది నా హృదిలో? ॥ఏదీ॥

లేదూ లేదూ నా హృదిలో వేదనలేదూ
లేదూ లేదూ నా యదలో దయలేదూ
లేదూ లేదూ నా మదిలో శుచిలేదూ
శుచిలేని నాకిక గతియేమిటో? ॥ఏదీ॥

పరిమిత బుద్ధులతో రగులుతున్న
ఈ హృదయగ్రంధి బ్రద్దలయ్యేదెప్పుడో
ఈ బుద్ధులన్నీ కాలి బూడిదయ్యేదెప్పుడో
ఈ హద్దులన్నిదాటి మనం ఏకమయ్యేదెప్పుడో?
॥ఏదీ॥

నీవూ నేనూ విడివిడిగావుంటే
తప్పదులే నాకీరంపపుకోత

మనమిరువురమూ ఒకటైతే
లేదులే మనకిక దూరమూ!

## 14

క్షణమే ఒకయుగమై విలపించిన
ఆనాటివేదన నేడేది నాయదలో?
యుగమే ఒక క్షణమనిపించిన
అలనాటి నీ ప్రేమ నేడేది నాకు?

మరచిపోయావో - నే మారిపోయానో
మాయచేస్తున్నావో - నే జారిపోతున్నానో
పాపకూపంలో నే కూరుకుపోతుంటే
నాచేయివీడి నీవేల చూస్తున్నావూ?

పాపిని నేనని ఉపేక్ష చేస్తున్నావో
మరికావాలనే పరీక్ష చేస్తున్నావో
మనస్సు చేతిలో నేనోడిపోతుంటే
నీవు చూస్తూ ఊరుకుంటే అది న్యాయమా?

నే మారిపోయినా - మరచిపోకు నీవు
నే జారిపోయినా - నా చేయి వీడకు

నాటి వేదన నేడొకసారి రుచి చూపి
ఓలలాడించు అలనాటి నీ ప్రేమలోనా!

నీ పొందుకోరి చేశాను నీతోటి పోరు
పోరాడి పోరాడి నేనోడిపోయానూ
నీవుతప్పా వేరెదిక్కు లేదు నాకూ
నీ పాదాలచెంత రాలిపోనీయి నన్నూ!

## 15

పాడనా! పరవశించీ నే పాడనా?
నీవు పంచే ప్రేమామృతం త్రాగి త్రాగి
మైమరచి కాలాన్నె నేమరచి
పొంగిపొరలే ఆనందభాష్పాలతో ॥ పాడనా ॥

చింతలు చెప్పుకోటానికొకనాడు
నాకంటే వేరుగా ఉన్నావు అలనాడు
నీకంటే భిన్నంగ నే లేనన్ననాడు
చెప్పుకోటానికేముంది నాకీనాడు? ॥ పాడనా ॥

పుట్టిపెరిగీ గిట్టేది తనువనీ
పుట్టిగిట్టే తనువు తానుకాదనీ

నిత్యమైన ఆత్మే తాననీ తెలిశాక
పుడితేయేముందీ - పోతే యేముందిలే? ॥పాడనా॥

నీవు బోధించు జ్ఞానగంగ గ్రోలి గ్రోలి
మనస్సంటే యేమిటో నాకు తెలిశాక
శోకాలసాగరం నే దాటిపోయానూ
ఆనందతీరానికి నే చేరువయ్యానూ! ॥పాడనా॥

**16**

నేను నేనంటు నీవెంత మాయచేస్తున్నావురా నేనుగా
ఈతోలుతిత్తిలోన జవసత్వాలు ఉన్నంతకాలం
నాదినాదంటు ఇంద్రియాలెక్కి స్వారీచేస్తున్నావే నీవు
ఒడలొడిలిపోగానే వదిలిపోతున్నావేర నీవు?

భోగాలకోసం లోకాలవెంటింకెన్నాళ్ళు ఊరేగుతావూ?
అలసి సొలసి నీ తనువు కునుకు తీసేవేళలో
అసలు తలపంటులేకుంటే నీకు ఉనికెక్కడుందిరా
నీ మూలమేదో చూసేటివరకేర నీ మిడిసిపాటు!

ఇన్నాళ్ళు తిరిగితిరిగి నేనెంతో విసిగిపోయానూ
ఇంత క్లేదానికీ బేధానికీ మూలమైనట్టి నీవూ

ఇకనైన నీ మూలాన్ని చేరి నీవణిగిపోతేను
నా తండ్రి ఒడిచేరి సుఖనిద్రలో నేతేలిపోతానూ!

## 17

నిన్న తిరిగిరాదని అది నీకూ తెలుసు
తెలిసి గతము తలసి వగసి లాభమేమీ?
రేపు నీదికాదని అదినీకూ తెలుసు
రూపులేని రేపుకోసం పరుగులెందుకునీకూ?

జరుగవలసినదేదో జరుగుతువుందీ
అది నీ చేతులలో లేదని నీకూ తెలుసు
తెలిసి గాలిమేడలెందుకు కడుతున్నావూ?
ఊహలలోకంలో ఎందుకు విహరిస్తున్నావూ?

దేవుడు నీకు బుద్ధిని యిచ్చాడెందుకో తెలుసా?
ఈ సృష్టికి సూత్రధారిగా తానొకడున్నాడనీ
పాత్రధారివి మాత్రమే నీవనీ తెలుసుకుంటే
సుఖము నీ సొంతమౌతుందని తెలుసుకుంటావనీ!

## 18

మాయబ్రతుకులు చూసి మోసపోకూ
మెరిసేదంతా నిజమని భ్రమపడకూ
ఎండమావులు ఈ పాడు బ్రతుకులు
నిలబడి నీవు నిజమేదో తెలుసుకో!

శ్వాస ఆగిపోయి గాలి గాలిలోన కలిసిపోతే
తనువు కాలిపోయి మట్టి మట్టిలోన కలిసిపోతే
నేనెవరో-నీవెవరో? ఎవరికి ఎవరూ ఏమౌతామో!
ఎక్కడికో మరుమజిలీ? ఎవరికివారే యమునాతీరే!

వస్తూ నీతో తెచ్చినదేది? పోయేవేళ నీతో వచ్చేదేది?
మరి నాదినాదని ప్రాకులాడే ఏదినీదీ - ఏదినాదీ?
నీ తనువే నీతో రాదే! గడపదాటి నీతో వచ్చేదేదీ?
నీటిమీద గీతలంటివీబ్రతుకులూ -
అవి చెరగక నిలచే దెన్నాళ్ళూ?

మట్టిలో కలిసిపోయే తనువుచూసి మురిసిపోకు
రెప్ప ఆడితేనే బ్రతుకు - రెప్పవాలితే మరి బూడిదే!
చావుపుట్టుకల కావల వెలిగే సత్యము ఒకటుందీ
ఆ చైతన్యము నిరతము నీయదలోనే వెలుగుతువుందీ!

ఆ చైతన్యమే నీ హృదిలో వెలుగుతు ఉండకపోతే
నేనను తొలితలపే నీయదలో ఉదయించదులే
ఆ నేనను తొలితలపునకే ఎన్నెన్నో తలపులు!
ఆ తలపులమూటే మనస్సు! మనస్సే మనిషికి
బంధము - మరుజన్మకు మూలమూ!

చితిమంటలలో కాలిపోయి దేహయాత్ర ఆగిపోయినా
కట్టెలలో మనస్సు కాలదూ - దాని పయనమాగదూ!
మనస్సుమూలం చూసేవరకు మనస్సుకులేదు
మరణమూ!
చేరుకో - ఆ మూలాన్ని చేర్చేటి మన తండ్రీ
పాదాలచెంత!

## 19

నీ పూజకు ఒక పూవునునేనై నీ పాదాలచెంత
నే వాడిపోవాలనుకున్నానూ
ఆకలిదప్పులులేని నీకూ నేనే ఒక పండై
నీకర్పణ కావాలనుకున్నానూ

వెలుగునుపంచే నీ నీడలోనే కర్పూరమేనేనై
కరిగిపోవాలనుకున్నానూ
కాలమిలా పగబూని నన్నూ దూరంగ విసిరేసి
కసితీర్చుకుంటుందనుకోలేదూ!

బండలాంటి నా గుండె కొండలాంటి నీ అండ
నను చేర్చిందనుకున్నానేగానీ
గుండేలేని మనిషల్లే బండలాగనేను బ్రతుకంత
బ్రతకాలనుకోలేదూ
కనుచూపుమేరలోనే నాకంటికినీవూ
కనిపిస్తావనుకున్నానేగానీ
కనుచూపుకెదూరమై కన్నీటికడలీలో నా బ్రతుకె
చీకటౌతుందనుకోలేదూ!

నీ శరణాలనీడలోనే నేరాలిపోయి
నీలో కలిసిపోవాలనుకున్నానేగానీ
నినువీడి దూరంగనేనూ పోయేటిరోజంటూ
ఒకటినానుదుట వ్రాసుందనీ

కలనైన నేనెన్నడూహించలేదూ! ఇది కలయా -
నిజమా? నా మతి భ్రమయా?
విధివ్రాతలే రాచేటి విధివిధాతవె నీవూ
- నా తలరాత మార్చలేవా తండ్రీ?

## 20

1. మనస్సా! ఓ మాయ మనస్సా!
నన్నెంత మాయచేశావే ఓ మనస్సా!

2. ఇన్నాళ్ళు నీవు నన్నంటివుంటేనూ
నీవు నేనూ ఒక్కటే అనుకున్నానే మనస్సా!

3. అందుకే నీవు చెప్పింది తూచా తప్పక
చేశానే నీకెన్నెన్నో ఊడిగాలూ ఓ మనస్సా!

4. చూశామె ఎన్నెన్నో దృశ్యాలు
చేశామె ఎన్నెన్నో కార్యాలు మనస్సా!

5. అవి స్మృతులురూపాన నన్నూ
తరుముకొస్తున్నాయె మనస్సా!

6. గతమంత ఓ పీడకలగా
మనమింక మరచిపోదామె మనస్సా!

7. కలిగింది కనువిప్పు నేడే
కదిలింది యదలోన వ్యధయేదొ మనస్సా!

8. నిద్రనుంచీ మేల్కాంచి మనమూ
నిజమేదొ తెలుసుకుందామె మనస్సా!

9. పగలంత లోకాలు తిరిగేటి నేనూ
మరి రేయెక్కడున్నానె మనస్సా?

10. నిజమైతె నిత్యముంటుందటా
నిద్రలో లేనట్టి నేనెట్లు నిజమౌదునే మనస్సా?

11. నిజమెప్పుడూ ఒకటిగానే ఉంటుందటా
నిమిషనిమిషానికీ మారేటి నేనెట్లు నిజమౌదునే
మనస్సా?

12. నీవెంట తిరిగి భోగాలు నేమరిగీ
నే మరచిపోయానె నా పుట్టుచోటూ ఓ మనస్సా!

13. కుక్కకుండే కృతజ్ఞతైనా లేకుండా
మనమెంత నీచంగ బ్రతికామె మనస్సా!

14. ఇకనైన నీవూ నన్నిడిచి పెడితేను
నా మూలమేదో తెలుసుకుంటానే మనస్సా!

15. నిజమేదో తెలుసుకొనకుండా
నూరేళ్ళు బ్రతికినా ఏముందె మనస్సా?

16. నేలవీడి నింగికెగసిన పక్షి
నేల చేరేవరకు సుఖమెక్కడే మనస్సా?

17. సుఖమెక్కడో బాహ్యంగవుందంటు
ఇన్నాళ్ళీలోకాలవెంట తిరిగామె మనస్సా!

18. సుఖమెక్కడా బయటలేదంట
నిజములో మాత్రమే సుఖముందంట మనస్సా!

19. ఆ నిజమెక్కడో దూరాన లేదంట
అది మనయదలోనే ఉందంట మనస్సా!

20. నేనెవడననుచూ లోదృష్టితోటి
నేపుట్టుచోటు శోధించాలంట మనస్సా!

21. అంత నాయదలోన వెలిగేటి ఆత్మనూ
సూటిగా నేచేరుకుంటానంట మనస్సా!

22. ఆత్మంటే ఏమిటో నీకేమైనా తెలుసా?
నాన్న చెప్పినమాట చెపుతాను వినుకోవె మనస్సా!

23. ఉన్నది ఒకటేనంటా - అది ఆత్మంటా!
అందుకే అది అఖండమంటా ఓ మనస్సా!

24. ఆత్మనుమించి అన్యములేదంటా!
అందుకే అది అద్వితీయమంటా ఓ మనస్సా!

25. చావుపుట్టుకలకది అతీతమంటా!
అందుకె అది అవ్యయమంటా ఓ మనస్సా!

26. దానికి ఆదీ లేదంటా - అంతము లేదంటా!
అందుకె అది అనంతమంటా ఓ మనస్సా

27. దానికి రేయీలేదంటా - పగలూ లేదంటా!
అందుకె అది కాలాతీతమంటా ఓ మనస్సా!

28. దానిని నీరు తడుపలేదంటా!
నిప్పు కాల్చలేదంటా - గాలి కదుపలేదంట
ఓ మనస్సా!

29. అది స్వయంప్రకాశమైన సుఖస్వరూపమంటా!
చిద్రూపమైన చైతన్యమంటా ఓ మనస్సా!

30. ఆ అనంత చైతన్యము నుంచి
చిందిన ఒకానొక తుంపరనే నేనంటా ఓ మనస్సా!

31. ఆ చైతన్యమె నాయదలో లేకుంటే
నేనను తలపే నాకుద్భవించదంటా ఓ మనస్సా!

32. ఆ నేనను తలపే తొలితలపంటా!
ఆ తొలితలపే నేనంటా ఓ మనస్సా!

33. నాకే ఎన్నెన్నో తలపులు అంటా
ఆ తలపులమూటే నీవంటా ఓ మనస్సా!

34. మరి నేనుంటేనే నీ ఉనికంటా!
నేలేకుంటే నీచిరునామె లేదంటా ఓ మనస్సా!

35. అందుకె ఇక మానవె నీ గారాలు!
చేయకె ఇక మారామూ! వినవే నా మాట
ఓ మనస్సా!


36. నీసహకారము నాకుంటేనే
మూలాన్ని నే చేరుకుంటానె ఓ మనస్సా!

37. మూలాన్ని చేరి నేనణిగిపోతేను
నా వెంట నీవణిగిపోతావే ఓ మనస్సా!

38. మన మణిగి పోయినచోటే
ఆత్మతానుగా వ్యక్తమౌతుందంట ఓ మనస్సా!

39. ఆత్మే తానైనవాడికింకా
లోకాలతోటి దేహాలతోటి పనిలేదే ఓ మనస్సా!

40. అంత చిద్రూపమైన ఆ చైతన్యమందు
స్థిరముగా మనముండిపోతామె ఓ మనస్సా!


సత్ చిత్ ఆనంద సంగమమ్